ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కర్ణాటక వార్తలు
శుక్రవారం 26 జనవరి 2024



నేడు 'మా తెలుగు తల్లి' పునః ప్రారంభ మహోత్సవం

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మా తెలుగుతల్లి సంస్థ పునః ప్రారంభ మహోత్సవాన్ని చంద్రశేఖరపురలోని అక్షయవనలో శుక్రవారం నిర్వహిస్తున్నామని సంస్థ అధ్యక్షుడు కె.ఉమామహేశ్వర్, కార్యదర్శి ఇందిరా బెల్డె గురువారం ప్రకటించారు. జ్యోతి ప్రజ్వలన అనంతరం మా తెలుగు తల్లి గీతం సామూహిక ఆలాపన ఉంటుందని, సంస్థ చిరు పరిచయం తర్వాత గౌరవ అతిథులను సన్మానిస్తామని వారు తెలిపారు. అనంతరం తెలుగు సత్సంగ నివేదిక విడుదల, మా తెలుగు తల్లి వార్షిక ప్రణాళిక విడుదల ఉంటాయి. సభ్యుల సలహాలు సూచనల తరువాత సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



కాంగ్రెస్‌కు షాక్

- శెట్టర్ రాజీనామాతో పార్టీలో కలకలం
- అదే బాటలోనే సవది, గాలి ?
- బిజేపీలో చేరికతో కమలం నేతల హర్షం




బీజేపీలో చేరిన జగదీష్‌శెట్టర్‌ను అభినందిస్తున్న యడియూరప్ప, విజయేంద్ర తదితరులు

సరిగ్గా ఏడునెలల కిందట జరిగిన శాసనసభ ఎన్నికల వేళ హుబ్బళి ధారవాడ సెంట్రల్ టికెట్‌ను ఆశించగా సర్వేల ప్రకారం ఓటమి తప్పదనే సంకేతాలలో టికెట్ ఇవ్వలేదు. బీజేపీ అధిష్ఠానం ససేమిరా అంది. సుదీర్ఘకాలంగా ఇదే స్థానం నుంచి శెట్టర్ విజయం సాధిస్తూ వచ్చారు. గతంలో ప్రతిపక్షనేతగానే కాకుండా ఏకంగా కీలకమైన ముఖ్యమంత్రి హోదాలో వ్యవహరించారు. విద్యార్థి దశనుంచి ఆర్‌ఎస్‌ఎస్ భావాలతో కొనసాగిన శెట్టర్ సుమారు 30 ఏళ్ళకు పైగా బీజేపీతో ప్రయాణం సాగించారు. అటువంటిది టికెట్ ఇవ్వలేదనే కారణంతో ఉన్నఫళంగా కాంగ్రెస్‌లో చేరిపోయారు. హుబ్బళి- ధారవాడ టికెట్ ఇచ్చినా ఆయన శిష్యుడిగా పేరొందిన మహేష్ టెంగినకాయ చేతిలో ఏకంగా 34వేల ఓట్ల తేడాతో ఓటమి చెందారు. కానీ కాంగ్రెస్ శెట్టర్ సీనియారిటీని పరిగణలోకి తీసుకుని విధానపరిషత్ సభ్యుడిని చేశారు. నాలుగైదు రోజుల కిందటి దాకా బీజేపీ నేతలను విమర్శించిన శెట్టర్ ఒక్కసారిగా ఫిరాయించారు.

టికెట్ రాక పోవడంతోనే కాంగ్రెస్‌లోకి

అదే బాటలోనే సవది, గాలి.. ?

గతంలో బీజేపీలో తిరుగులేదని భావించిన అగ్రనేతలలో శెట్టర్ తిరిగి సొంతగూటికి చేరడంతో ఇక మిగిలింది లక్ష్మణసవది.. గాలి జనార్ధనరెడ్డి అనే ప్రచారం సాగుతోంది. లోక్‌సభ ఎన్నికలు ముంచుకొస్తున్న వేళ రాజకీయ పావులు కదిపే ప్రక్రియలో ఇరుపార్టీల అగ్రనేతలు తీవ్రమైన కసరత్తు సాగిస్తున్నారు. హుబ్లీ - ధారవాడ జిల్లాలో లింగాయత సమాజం బలమైనది కావడంతో శెట్టర్ లేకుండా ఎన్నికలకు వెళితే పెనుముప్పు తప్పదనే కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి వ్యూహాత్మకంగా వ్యవహరించి తిరిగి పార్టీలోకి రప్పించుకున్నట్లు సమాచారం. ఇక బెళగావి జిల్లాకు చెందిన లక్ష్మణసవది కూడా ఎప్పుడైనా వెనుదిరగవచ్చు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో గురువారం హుటాహుటిన సవది డీసీఎం డీకే శివకుమార్ నివాసానికి చేరుకుని చర్చలు జరిపారు. తాను ఎట్టిపరిస్థితిలోను కాంగ్రెస్ వీడేది లేదని స్పష్టం చేశారు. కాగా బీజేపీని వీడి ఏకంగా సొంత పార్టీ ద్వారా ఎమ్మెల్యే అయిన గాలి జనార్ధనరెడ్డిని కూడా లోక్‌సభ ఎన్నికలలోగానే తిరిగి కమలం గూటికి రప్పించుకునే ప్రయత్నాలు సాగుతున్నట్లు సమాచారం. శెట్టర్ కాంగ్రెస్ వీడటంతో ఆ పార్టీకు ఒక్కసారిగా షాక్ ఇచ్చినట్లు అయ్యింది. ఎవరూ స్పందించే అవకాశం కూడా లేకుండా పోయింది. అయితే బీజేపీ వర్గాలలో మాత్రం సంతోషం వ్యక్తమైంది. ఇటు బెంగళూరు అటు హుబ్బళి ధారవాడలలోను పార్టీ ముఖ్యులు సంబరపడ్డారు. బీజేపీలో ఒడిదొడుకులు దాటుకుని మోదీని ప్రధానిని చేస్తామని పార్టీ నేతలు అంటున్నారు.



లోక్‌సభ ఎన్నికలకు ముందే

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు ఆనందం అట్టే నిలవడం లేదు. అసమ్మతి నేతలను బుజ్జగించడం పూర్తయిందనుకునేలోగా పార్టీకి మరో షాక్ తగిలింది. రాజకీయాలలో శాశ్వత శత్రువులు కానీ శాశ్వత మిత్రులు కానీ ఉండరనే నేతల వ్యాఖ్యల తరహాలోనే రాష్ట్రంలో అనూహ్యమైన సంఘటన చోటు చేసుకుంది. రాష్ట్ర రాజకీయాల్లో సీనియర్ నేత, కాంగ్రెస్ పార్టీ విధాన పరిషత్ సభ్యుడు జగదీష్‌శెట్టర్ అనూహ్యంగా బీజేపీలో చేరారు. ఊహించని విధంగా జరిగిన పరిణామంతో రాష్ట్ర కాంగ్రెస్‌లో కలకలం చెలరేగగా బీజేపీ వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. ఇటీవల నాలుగైదు రోజులుగా ప్రచారం సాగుతున్నా అదంతా ఒట్టిదేనని కాంగ్రెస్ వర్గాలు ఖండించాయి. చివరకు సీఎం సిద్దరామయ్య కొన్ని గంటల ముందు ఎట్టి పరిస్థితిలోను శెట్టర్ పార్టీ మారేది ఉండదన్నారు. కానీ గురువారం ఉదయం జగదీష్‌శెట్టర్ నేరుగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలను కలిశారు. అంతలోనే సీనియర్ నేతల సమక్షంలో ఢిల్లీ పార్టీ కార్యాలయంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. ఢిల్లీలో శెట్టర్ వెంట అగ్రనేత యడియూరప్ప, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు విజయేంద్రలు ఉన్నారు. రాత్రికి రాత్రి శెట్టర్‌తో పాటు యడియూరప్ప, విజయేంద్రలు ఢిల్లీ చేరుకున్నట్లు తెలుస్తోంది. అంతకు ముందే కేంద్రహోంమంత్రి అమిత్‌షాతో ఫోన్‌లో చర్చించి ఖరారు చేసుకున్నారు. అనుకున్నట్లుగానే శెట్టర్‌ను తిరిగి కమలదళంలోకి తీసుకురావడంలో యడియూరప్పతో పాటు విజయేంద్రలు పంతం నెగ్గించుకున్నారు.



డీకేతో ఎమ్మెల్యే లక్ష్మణసవది

రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు

● మాజీ ముఖ్యమంత్రి బొమ్మై జోష్యం

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలకు ముందే రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు చోటు చేసుకోబోతున్నాయని మాజీ ముఖ్యమంత్రి బసవరాజ బొమ్మై జోష్యం చెప్పారు. బెంగళూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జగదీష్ శెట్టర్ తిరిగి బీజేపీలో చేరడాన్ని స్వాగతించారు. ఆయన సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకున్నారని వ్యాఖ్యానించారు. శాసనసభ ఎన్నికల సమయంలో బీజేపీలో జరిగిన కొన్ని పరిణామాల కారణంగా ఆవేదనకు గురై ఆయన కాంగ్రెస్‌లో చేరారని, అంతేగానీ ఆ పార్టీపై అభిమానంతో కాదన్నారు. జనసంఘ్ కాలం నుంచి తాను జగదీష్ శెట్టర్‌ను చాలా దగ్గరగా చూస్తున్నానన్నారు. కాంగ్రెస్ డీఎన్ఏ శెట్టర్‌కు సరిపోదన్నారు. ఆయన కాంగ్రెస్‌లో చేరినా మనస్సు మాత్రం బీజేపీతోనే ఉందన్నారు. పలు కారణాలతో శాసనసభ ఎన్నికల సమయంలో బీజేపీ వీడిన నేతలంతా తిరిగి సొంతగూటికి చేరుకోవడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌కు చెందిన పలువురు కీలక నేతలు కూడా బీజేపిలో చేరతారన్నారు. బీజేపీ ఒక కులానికో మతానికో పరిమితం కాదన్నారు. ముచ్చటగా మూడో సారి నరేంద్రమోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు.

అవమానిస్తే.. అక్కున చేర్చుకున్నాం: సీఎం

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల్లో బీజేపీ టికెట్‌ను నిరాకరించి దారుణంగా అవమానిస్తే, కాంగ్రెస్ గౌరవించి ఎమ్మెల్సీ చేసి గౌరవించిందని తిరిగి బీజేపీ గూటికి చేరుకున్న మాజీ సీఎం జగదీష్ శెట్టర్‌ను ఉద్దేశించి ముఖ్యమంత్రి సిద్ధరామయ్య వ్యాఖ్యానించారు. కొడగు జిల్లా విరాజపేటలో గురువారం సీఎం మీడియాతో మాట్లాడారు. శెట్టర్‌కు కాంగ్రెస్ ఎనలేని గౌరవాన్ని ఇచ్చిందని ఆయనను ఏమాత్రం అవమానించలేదని సిఎం పేర్కొన్నారు. పది రోజుల క్రిత్రం ఒక కార్యక్రమంలో తాను శెట్టర్‌ను కలిశానని ఆపై మాట్లాడలేదన్నారు. శెట్టర్ తీరు ఒకింత బాధ కలిగించిందన్నారు. ఆయనకు మంచి జరగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఇండియా కూటమిలో లుకలకలు ఏవీ లేవని అంతా త్వరలోనే సర్దుకుంటుందన్నారు. అధిష్ఠానం పెద్దలు అం తా చూసుకుంటారన్నారు. కాఫీ రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించే అంశాన్ని పరిశీలిసున్నామన్నారు. కనీసం 10 హార్స్‌పవర్ వరకు ఈ ఉచిత విద్యుత్ లభిస్తుందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు ప్రధాని నరేంద్రమోదీ వస్తే ఏడాదికి 2 కోట్ల చొప్పున గత పదేళ్ళలో 20 కోట్ల ఉద్యోగాలు ఏమయ్యాయో నిలదీయాలన్నారు.



విరాజ్‌పేటలో మీడియాతో మాట్లాడుతున్న సీఎం



ఆయన ఆత్మసాక్షికే వదిలేస్తాం : డీకే

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీనియర్ నేత జగదీష్ శెట్టర్‌తో బుధవారం కూడా మాట్లాడా. తనను అవమానాల పాల్జేసిన బీజేపీలోకి వెళ్ళబోనని ఆయన ఖరాఖండిగా చెప్పారు. మరి ఎవరి ఒత్తిళ్ల మేరకో బీజేపీలో చేరిపోయారు. ఈ విషయాన్ని ఆయన ఆత్మసాక్షికే వదిలేస్తున్నాం.. అని ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డికె.శివకుమార్ వ్యాఖ్యానించారు. నగరంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. సీనియర్ నేత కావడంతో కాంగ్రెస్ జగదీష్ శెట్టర్‌ను అత్యంత గౌరవంగా చూసుకుందని అసెంబ్లీ టికెట్ ఇచ్చిందని 35వేల ఓట్ల తేడాతో ఓటమిపాలైనా ఆయన గౌరవాన్ని పెంచాలనే ఉద్దేశంతో విధానపరిషత్ సభ్యుడిగా ఎన్నుకున్నామని డీకే తెలిపారు. తాము ఉంచిన నమ్మకాన్ని శెట్టర్ వమ్ముచేశారన్నారు. దేశ ప్రయోజనాలకోసమే మళ్ళీ బీజేపిలో చేరినట్లు శెట్టర్ చేసిన ప్రకటనపై స్పందిస్తూ శాసనసభ ఎన్నికల్లో బీజేపీ ఆయనకు టికెట్ నిరాకరించి ఘోరంగా అవమానించినప్పుడు దేశ ప్రయోజనాలు కనిపించలేదా అని ఎద్దేవా చేశారు. శెట్టర్ రాజీనామా లేఖ ఇంకా తనకు అందలేన్నారు. శెట్టర్ ప్రభావం పార్టీపై ఏ మాత్రం ఉండబోదన్నారు. లోక్‌సభ ఎన్నికలకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేసుకుంటున్నామని ప్రకటించారు.

నేడు గణతంత్ర వేడుకలు

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం వేడుకలు నిర్వహించనున్నారు. జిల్లాల వారీగా ఇన్‌ఛార్జ్ ఆయా జిల్లాలకు మంత్రులు చేరుకున్నారు. బెంగళూరు మణెక్ షా పరేడ్ మైదానంలో గవర్నర్ థావరచంద్ గెహ్లాట్ జాతీయ పతాకాన్ని అవిష్కరించి రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి ప్రసంగించనున్నారు. త్రివిధ దళాధితపతులతో పాటు వివిధ విభాగాల పోలీసులు, ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థుల ప్లటూన్‌లు ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొననున్నాయి. గవర్నర్ గౌరవ వందనం స్వీకరించాక పరేడ్ సాగనుంది. ఆతర్వాత బెంగళూరు దక్షిణ, ఉత్తరతో పాటు వివిధ విభాగాలు చెందిన విద్యార్థుల బృందాలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇస్తారు. జిల్లా కేంద్రాల్లో జిల్లాధికారులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం జరిగే గణతంత్ర వేడుకలలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రితో పాటు ముఖ్య అధికారులు భాగస్వామ్యులవుతారు. ఇప్పటికే జిల్లాల వారీగా ప్రత్యేక శకటాలను ఏర్పాటు చేసుకునేలా ఆదేశించిన మేరకు అందుకు అనుగుణంగా చర్యలు అన్ని జిల్లాలోను సాగుతున్నాయి. మాణెక్ షా పరేడ్ మైదానం చుట్టూ భారీ బందోబస్తు చర్యలు చేపట్టారు. అదే తరహాలోనే హైకోర్టు సహా అన్ని ప్రభుత్వ కార్యాలాయాలు, విద్యాసంస్థలలోను జాతీయ పతాకా విష్కరణలు ఉంటాయి. కాగా గణతంత్ర దినోత్సవాలను పురస్కరించుకుని బెంగళూరు సహా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని చారిత్రాత్మక కట్టడాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రజలకు గవర్నర్ థావర్ చంద్ గెహ్లాట్, సీఎం సిద్దరామయ్యలు రిపబ్లిక్ డే శుభాకాంక్షలు తెలిపారు. నగరంలోని రాజాజీనగర్ ఓరయన్ మాల్‌లో ప్రత్యేక జాతీయ పతాకా నమూనాను ఆకర్షణీయంగా తీర్చారు.



మూడు రంగుల్లో ఆకట్టుకుంటున్న ఇండియా గేట్ చిత్రం

బ్రహ్మాండం.. బనశంకరీదేవి

బ్రహ్మరథోత్సవం

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి బ్రహ్మరథోత్సవం బనశంకరిలో గురువారం కనుల పండువగా జరిగింది. నగరం చుట్టు పక్కల ప్రాం తాల నుంచి అశేషంగా భక్తులు తరలివచ్చారు. వేకువజామున సుప్రభాత సేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు ఎ.చంద్ర మోహన్ ప్రత్యేక అర్చనలు, అభిషేకం నిర్వహించారు. బనశంకరి మూలవిరాట్‌ను విభిన్న రకాల పూలతో అందంగా అలంకరించారు. అనంతరం మృత్యుంజయ , పురస్సర, నవగ్రహ శాంతి, దేవిమూలమంత్ర హోమం, రదాంగహోమం నిర్వహించారు. అమ్మవారి కళశాలను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ ఈఓ లక్ష్మీ, ప్రధాన అర్చకులు ఎ.చంద్రమోహన్, బనశంకరి దేవస్థానం వ్యవస్థాపక కమిటీ మాజీ అధ్యక్షుడు ఎ.హెచ్. బసవరాజ్ తీసుకెళ్ళి రథంపై ప్రతిష్ఠించారు. అనంతరం విశేష అలంకరణ జరిపిన బనశంకరి ఉత్సవమూర్తి విగ్రహాన్ని మంగళ వాయిద్యాలతో ఊరేగించారు. రథంపైకి అరటి పండ్లు, ధవనం విసిరి భక్తులు మొక్కులు తీర్చు కున్నారు. రథాన్ని లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. వేల సంఖ్యలో భక్తులు ఉత్సవాల్లో పాల్గొనడంతో పండుగ వాతావరణం కనిపించింది.



రథోత్సవానికి హాజరైన భక్తులు, అలకంరణలో బనశంకరీ అమ్మవారు (ఇన్‌సెట్లో)

బీబీఎంపీకి రూ.675 కోట్ల గ్రాంటు విడుదల


బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాజధాని బెంగళూరులో మౌలిక సదుపాయలను అభివృద్ధి చేసే దిశలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం బృహత్ బెంగళూరు మహానగర పాలికె (బీబీఎంపీ)కి రూ.675 కోట్ల నిధులను గురువారం విడుదల చేసింది. రాజధాని నగరంలో పెట్టుబడులను ఆకర్షించే దిశలో మౌలిక సదుపాయాలను తీర్చిదిద్దాలని గతంలో రూ 3వేల కోట్లను కేటాయించిన ప్రభుత్వం, మూడు నెలలకో సారి గ్రాంటు రూపంలో కొంత మొత్తాన్ని విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. కేవలం పెట్టుబడులను ఆకర్షించే ప్రాజెక్టులకు మాత్రమే ఈ మొత్తాన్ని ఖర్చు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ ప్రాజెక్టుల కోసం ప్రభుత్వం ఇంతవరకు బీబీఎంపీకి విడుదల చేసిన మొత్తం రూ.1350 కోట్లకు చేరుకుందని రూ.2,150 కోట్ల మేరకు బిల్లు బకాయిలు ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని బీబీఎంపీ ఉన్నతాధికారి ఒకరు నగరంలో మీడియాకు వెల్లడించారు.



నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

శివలెంక శంభుప్రసాద్ (జయంతి)



శివలెంక శంభుప్రసాద్ 1911 జనవరి 26న కృష్ణా జిల్లా ఎలకుర్రులో జన్మించారు. 1938లో ఆంధ్రపత్రిక, భారతి పత్రికలకు సంపాదకులుగా 34ఏళ్లపాటు సుదీర్ఘంగా వ్యవహరించి తెలుగు పత్రికారంగంలో ఎన్నో కొత్తరీతులు ప్రవేశపెట్టారు. పీటీఐ డైరెక్టర్‌గా కొంత కాలం వ్యవహరించారు. 'పడక కుర్చీ భావాలు' శీర్షికతో వ్యంగ్య వ్యాసాలు, తెలుగు వెలుగులు శీర్షికన ప్రముఖుల పరిచయాలు ఎంతో పేరొందాయి. రాజ్యసభ సభ్యులుగా, ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులుగా వ్యవహరించారు. 1972 జూన్ 8న కన్నుమూశారు.

గుమ్మడి వెంకటేశ్వరరావు (వర్ధంతి)



'కళాప్రపూర్ణ' గ్రహీత గుమ్మడి వెంకటేశ్వరరావు 1927 జూలై 9న గుంటూరు జిల్లాలో జన్మించారు. తెలుగు సినీరంగంలో ఐదు దశాబ్దాలలో 500కుపైగా సినిమాలలో విభిన్న తరహాపాత్రలు పోషించారు. పౌరాణిక, జానపద, సాంఘిక, చారిత్రక ఇలా అన్నిరకాల చిత్రాలలో తండ్రిగా, అన్నగా, తాతగా పలు పాత్రల్లో నటించారు. ఇంటి పేరు 'గుమ్మడి'తోనే ప్రేక్షకుల మనసులో నిలిచారు. రఘుపతి వెంకయ్య అవార్డు ఇతర పురస్కారాలు పొందారు. సినీ రంగానికి ఆయన సేవలను గౌరవిస్తూ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆయనను కళాప్రపూర్ణ బిరుదుతో సత్కరించింది. 2010 జనవరి 26న కన్నుమూశారు.

కోబి బ్రాయంట్ (వర్ధంతి)



కోబి బీన్ బ్రాయంట్ 1978 ఆగస్టు 23న ఫిలడెల్ఫియాలో జన్మించారు. అమెరికాలో పేరొందిన బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు. షూటింగ్ గార్డ్‌గా రాణించారు. 20 ఏళ్ల క్రీడా జీవితంలో లాస్ ఏజెంల్స్ లేకర్స్‌లోని నేషనల్ బాస్కెట్‌బాల్ అసోసియేషన్‌లో గడిపారు. ఎన్‌బీఏ హిస్టరీలో 20 సీజన్స్‌లో తొలి గార్డ్‌గా నిలిచారు. ఎబ్లాక్ మాంబ్ అని తనకు తాను నిక్‌నేమ్ పెట్టుకున్నాడు. 2008, 2012 సమ్మర్ ఒలింపిక్స్‌లో రెండు బంగారు పతకాలు సాధించారు. 2020 జనవరి 26న విమాన ప్రమాదంలో మృతి చెందారు.

విజయ్ శంకర్ (పుట్టినరోజు)



విజయ్ శంకర్ 1991 జనవరి 26న తమిళనాడు రాష్ట్రం తిరునల్వేలిలో జన్మించారు. జాతీయ క్రికెట్ జట్టులో ఆల్‌రౌండర్‌గా ఉంటూ రైట్ హ్యాండ్ బ్యాట్స్‌మన్‌గా, మీడియం పేసర్‌గా కొనసాగుతున్నారు. 2014-15 తమిళనాడు నుంచి రంజీ ట్రోఫీలో పాల్గొని రెండుసార్లు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచారు. 2019 క్రికెట్ వరల్డ్‌కప్‌లోనూ పాల్గొని సత్తా చాటుకున్నారు. ఆస్ట్రేలియాపై వన్డేమ్యాచ్‌లో కీలకంగా వ్యవహరించారు. 2022 ఐపీఎల్ వేలంలో గుజరాత్ టైటాన్స్ జట్టుకు దక్కారు.

రాష్ట్రమంతటా రాజ్యాంగంపై అవగాహన: సీఎం

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): దేశంలో ప్రజా ప్రభుత్వం సజావుగా నడిచేందుకు తద్వారా హక్కులు, విధులు, సౌలభ్యాలు, సమానత్వం కల్పించే అత్యంత పవిత్రమైన రాజ్యాంగం గురించి రాష్ట్రమంతటా అవగాహన కల్పించ దలచామని సీఎం సిద్దరామయ్య స్పష్టం చేశారు. గురువారం మైసూరులోని నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన ఆయన రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్ళు పూర్తి అవుతున్న సందర్భంలో ఎంతమేర సఫలీకృతం జరిగిందనేది ప్రజలు తెలుసుకోవాలనే జాతర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నెలరోజుల పాటు రాజ్యాంగం చైతన్య జాతర జరగనుందన్నారు. గణతంత్ర దినోత్సవాన కార్యమాన్ని ప్రారంభిస్తామని ఫిబ్రవరి 25వ తేదీతో ముగుస్తుందన్నారు. ఫిబ్రవరి 24,25వ తేదీలలో చర్చాగోష్ఠి నిర్వహిస్తామని, రాజ్యాంగం దేశంలోని అన్ని విభాగాలకు మూల కేంద్రమైనదన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అలుపెరుగని శ్రమ, భావితరాలకు అందాల్సిన హక్కులకు సంబంధించి సమగ్రంగా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. దేశం విభిన్నమైన సంస్కృతి, సామాజిక వ్యవస్థ, నీతినియమాల ఉన్నా సమానత్వంగా జీవించే హక్కు రాజ్యాంగం ద్వారా సాధ్యమైందన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ రాజ్యాంగం విలువలు, హక్కులను తెలిపేందుకు ప్రత్యేక జాతర నిర్వహిస్తున్నామన్నారు. గ్రామపంచాయతీ, హోబళి, జిల్లా కేంద్రాల్లో జాతర సాగనుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 6వేల గ్రామపంచాయతీల్లో జాతర పర్యటించనుందన్నారు. రాజ్యాంగాన్ని మార్పు చేయాలని లేదా నిర్వీర్యం చేయాలనే కొందరి అభిప్రాయాలు తప్పు అనేలా జాతర సాగుతుందన్నారు. మంత్రులు మహదేవప్ప, వెంకటేష్, భైరతీ సురేష్ తదితరులు ఉన్నారు.



రాజ్యాంగ జాతర వివరాలు వెల్లడిస్తున్న సీఎం, మంత్రులు

'గ్రామ చలో' అభియానకు 40 వేల మంది కార్యకర్తలు

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): 'గ్రామ చలో' అభియానకు రాష్ట్రవ్యాప్తంగా 40వేల మంది కార్యకర్తలను ఎంపిక చేసినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.సునీల్ కుమార్ ప్రకటించారు. బెంగళూరు మల్లేశ్వరంలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఓట్ల శాతాన్ని గణనీయంగా మెరుగుపరుచుకునేందుకు ఈ అభియాన దోహదపడుతుందన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో గ్రామాల్లో వచ్చిన ఓట్ల కంటే 10 శాతం పెంచుకోవడమే ఈ అభియాన లక్ష్యమన్నారు. ఎంపికైన కార్యకర్తలకు ఫిబ్రవరి మొదటి వారంలో ప్రత్యేక శిక్షణనిస్తామన్నారు. ఈ కార్యకర్తలు అన్ని గ్రామాలను పర్యటించి కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తారని, ఇదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను తెలియజేస్తారని ఆయన వెల్లడించారు. శ్రీరాముడిని కాదని ఏ రాజకీయ పార్టీ కూడా హిందువుల హృదయాలను గెలవలేదన్నారు. అయోధ్యలో రామమందిర నిర్మాణం దశాబ్దాల కాలంగా బీజేపీ అజెండాలో ఉందని ప్రధాని మోదీ దేశంలో మెజార్టీ ప్రజల ఆకాంక్షను పూర్తిచేశారని ఆయన పేర్కొన్నారు.

షిర్డీలో కమ్మసేవా భవన్ పునః ప్రారంభం

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): షిర్డీలో కమ్మ సేవా భవన్ మరింతగా ఆధునీకరించుకుని భక్తుల కోసం తిరిగి ప్రారంభమైంది. పాలక వర్గం అధ్యక్షుడు కొసరాజు గోపాలకృష్ణ ఈ మేరకు బెంగళూరులో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. షిర్డీలో 2018 మేలో ప్రారంభమై 2020 కొవిడ్ అవధి వరకు వేలాది మంది సాయి బాబా భక్తులకు వసతితో పాటు ఉచిత భోజన సదుపాయాలను అందించామని తెలిపారు. షిర్డీ సాయిబాబా చావడి నుండి 700 మీటర్ల నడక దూరంలో ఉన్న కమ్మ సేవా భవన్‌లో గదుల సంఖ్య 42కు పెంచామన్నారు. భక్తులను సాయిబాబా ఆలయం వద్దకు డ్రాప్ చేసేందుకు ప్రత్యేక వాహన సదుపాయం కూడా అందుబాటులో ఉంటుందని తెలిపారు. రిజర్వేషన్లు ఇతర వివరాల కోసం 8432993999కు సంప్రదించాల్సి ఉంటుందన్నారు. కాగా కమ్మ సేవా భవన్ ప్రారంభోత్సవ వేడుకల్లో తెలంగాణా కాంగ్రెస్ కార్యాధ్యక్షుడు జెట్టి కుసుమ్ కుమార్, అనంతపురం షిర్డీ సాయి బాబా సేవా సంఘం అధ్యక్షుడు వైకుంఠం జయచంద్ర చౌదరి, షిర్డీ డిప్యూటీ ఎస్పీ సందీప్ మిట్కె తదితరులు పాల్గొన్నారని పూజాది కార్యక్రమాల్ల కొసరాజు గోపాలకృష్ణ ఆయన సతీమణి మాధవి కొసరాజు పాల్గొన్నారని ప్రకటనలో పేర్కొన్నారు. ఇదే సందర్భంగా సాయిబాబా చిత్రంతో రూపుదిద్దుకున్న ప్రత్యేక క్యాలెండర్‌ను షిర్డీ డిప్యూటీ ఎస్పీ సందీప్ మిట్కె లాంఛనంగా ఆవిష్కరించారని ప్రకటన తెలిపింది. కాగా కర్ణాటక భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అఖిల కర్ణాటక కమ్మవారి సంఘం అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ పిలుపునిచ్చారు.



ప్రారంభోత్సవ కార్యక్రమంలో ప్రముఖులు

ఉత్తమ సేవలకు రాష్ట్రపతి పురస్కారాలు

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): గత ఏడాది శాసనసభ ఎన్నికల వేళ వివిధ ప్రాంతాలు హోదాలలో ఉత్తమ సేవలు అందించిన ఇద్దరు మహిళా అధికారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పురస్కారాలను ప్రధానం చేశారు. వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న శిఖా, చిత్రదుర్గ జిల్లాధికారి, జిల్లా ఎన్నికల అధికారి దివ్యా ప్రభులు గురువారం ఢిల్లీలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో పురస్కారాలు పొందారు. 2023 ఎన్నికల వేళ వాణిజ్యపన్నుల శాఖ కమిషనర్‌గా శిఖా ప్రజలలో చైతన్యం తీసుకురావడం ద్వారా ఉచిత పంపిణీలపై విస్తృతంగా ప్రచారం చేశారు. ఇక చిత్రదుర్గ జిల్లాధికారి దివ్యాప్రభు ఓటరు జాబితా సవరణ, యువ ఓటర్ల చేరికతో పాటు ప్రత్యేక పోలింగ్ బూత్‌ల ఏర్పాటు ద్వారా జిల్లాలో ప్రత్యేకత అనిపించుకున్నారు. ఇక రేడియో మిర్చి ఎఫ్ఎం ఎన్నికలకు సంబంధించి ప్రజలలో చైతన్యం తీసుకువచ్చిన మేరకు ఉత్తమ పురస్కారం దక్కింది., రాష్ట్రం నుంచి ఉత్తమ పురస్కారాలు పొందిన అధికారులతో పా టు రేడియో మిర్చి ప్రతినిధులకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా ప్రత్యేకంగా హర్షం వ్యక్తం చేశారు.



రాష్ట్రపతి ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న అధికారి

ఓటర్లే భారత భాగ్య విధాతలు: గవర్నర్

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని గవర్నర్ థావర్ చంద్ గెహ్లోట్ పిలుపునిచ్చారు. బెంగళూరు టౌన్‌హాల్‌లో గురువారం ఏర్పాటైన 14వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసంగిస్తూ ఓటర్లే భారత భాగ్య విధాతలని కొనియాడారు. ప్రపంచంలోనే చాలా దేశాలు భారత ప్రజాస్వామ్య వ్యవస్థను వేనోళ్లా కొనియాడుతున్నారన్నారు. 1950 జనవరి 25న ఎన్నికల సంఘం ఏర్పాటైందని నాటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికలను నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ దేశ ప్రజల విశ్వాసాన్ని చూరగొంటోందన్నారు. త్వరలో జరిగే లోక్‌సభ ఎన్నికల పండుగలో అందరూ పాలుపంచుకోవాలని గవర్నర్ కోరారు. ఇదే సందర్భంగా తొలిసారి ఓటు హక్కును పొందిన యువతీయువకులకు, దివ్యాంగులకు ఆయన ఓటరు గుర్తింపు కార్డులను అందజేసి అభినందించారు. రాష్ట్ర చీఫ్ ఎలక్షన్ కమిషనర్ మనోజ్‌కుమార్ మీనా, బెంగళూరు జిల్లా రిటర్నింగ్ అధికారిగా ఉన్న బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్ గిరినాథ్ తదితరులు ఈ సందర్భంగా ప్రసంగించారు. ఇదే వేదికపై నా భారత కన్నడ పాటను ఆవిష్కరించారు. శాసనసభ ఎన్నికల నిర్వహణలో అత్యుత్తమ ప్రతిభను కనబర్చిన అధికారులను ఇదే వేదికపై రాష్ట్ర స్థాయి పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఎన్నికల జాగృతి కోసం రూపొందించిన పోస్టర్లను గవర్నర్ తిలకించారు. అదనపు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ కురుమె రావ్, నోడల్ అధికారి పిఎస్.వస్త్రద్, ఎన్నికల విభాగం ప్రత్యేక కమిషనర్ రామచంద్రన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



గవర్నర్ థావర్‌చంద్ గెహ్లోట్‌తో నూతన ఓటర్లు

బెంగళూరులో 75శాతం మరుగుదొడ్లకు తలుపులే లేవు

● గువు ఛేంజ్ లీడర్ అర్చనా ఆవేదన

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరం పరిధిలో సామూహిక మరుగుదొడ్లు మహిళలకు ఏమాత్రం సురక్షితం కాదని ఏకంగా 75శాతం తలుపులు లేనివేనంటూ గువు చేంజ్ లీడర్ అర్చనా ఆవేదన వ్యక్తం చేశారు. నగర వ్యాప్తంగాది బిగ్ బెంగళూరు టాయ్‌లెట్ పేరిట జరిపిన సర్వే వివరాలను గురువారం అర్చనా మీడియాకు వెల్లడించారు. 75శాతం మహిళల మరుగుదొడ్లకు సరైన లాక్‌లు లేవని పేర్కొన్నారు. మహిళల మరుగుదొడ్లలోనే శుభ్రం చేసే కుటుంబీకులు నివసిస్తారని అక్కడే పురుషులు ఉంటారని తెలిపారు. బెంగళూరు నగర వ్యాప్తంగా 48 పబ్లిక్ టాయ్‌లెట్‌లను సమగ్రంగా పరిశీలించినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మరుగుదొడ్ల శుభ్రత, రక్షణ వంటి అంశాలపై పర్యవేక్షణ జరిపే స్థానిక సంస్థలు లేదా ఇతరత్రా ప్రభుత్వ శాఖల తీరు మార్చుకోవాలనే సర్వే జరిపినట్లు స్పష్టం చేశారు. అత్యవసరం కోసం మరుగుదొడ్లకు వెళితే ఆరోగ్యంతో పాటు రక్షణ ముఖ్యమన్నారు. తలుపులు లేకుండా మరుగుదొడ్లను ఎలా ఉపయోగిస్తారని, పబ్లిక్ టాయ్‌లెట్‌లను సరిగ్గా శుభ్రం చేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలంగా మరుగు దొడ్లలో మార్పు కోసం ప్రయత్నిస్తున్నామని ప్రభుత్వ పాఠశాలల పరిధిలో మరుగుదొడ్ల శుభ్రత పాటించేందుకు నిధులు కేటాయించాలని డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. 2021 బడ్జెట్‌లో పాఠశాలల మరుగుదొడ్లకు వందకోట్లు విడుదల చేశారన్నారు. అర్చన స్టాండ్ ఫర్ షి అనే సంస్థ వ్యవస్థాపకురాలిగా ఉన్నట్లు గువు కలెక్టివ్ కో ఫౌండర్ ప్రీతి హర్మన్ పేర్కొన్నారు.

28న విశ్వకర్మల జాతీయ సదస్సు

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో విశ్వకర్మలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ఈనెల 28న ఢిల్లీలో సదస్సు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ రఘుఆచార్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఆయన బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ విశ్వకర్మల యువత భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన విధానాలపై చర్చలు జరుపుతామన్నారు. విశ్వకర్మల ద్వారా సమాజానికి ఎన్నో రంగాలలో సేవలు అందుతున్నాయన్నారు. విశ్వకర్మలు బీసీ వర్గీయులుగానే ఉన్నా ఆర్థికంగా, రాజకీయంగా వెనుకబడ్డారన్నారు. ఢిల్లీ లీలా ప్యాలెస్‌లో ఉదయం నుంచి సాయంత్రంగా నిరంతరంగా సమావేశం ఉంటుందన్నారు. దేశంలోనే ప్రముఖుడిగా పేరొందిన శ్యాంపిట్రోడా, బాలీవుడ్ నటుడు రాజ్‌బబ్బార్ సహా దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారన్నారు. భవిష్యత్ పదేళ్ళ ప్రణాళికల గురించి నిర్ణయాలు తీసుకుంటామన్నారు. ఇండియన్ విశ్వకర్మ గ్రూప్ ఆఫ్ ఆఫీసర్స్ అండ్ బిజినెస్‌మెన్ అనే సంస్థ ద్వారా సమావేశం జరుపుతున్నామన్నారు. రాష్ట్రం నుంచి పెద్దఎత్తున విశ్వకర్మలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

28న షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు రాజాజినగర్ ఐదో బ్లాకులో గల కైలాస వైకుంఠ మహాక్షేత్ర దేవస్థానంలో ఈ నెల 28న షిర్డీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం జరుగనుంది. ఈ మేరకు దేవస్థానం అధ్యక్షుడు ఆర్.వి.హరీష్ నగరంలో గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆలయంలో ప్రాణప్రతిష్ఠ కార్యక్రమాలు హోమాలు ఉదయం 6 గంటలకు ప్రారంభమై మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటాయని భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ప్రకటనలో కోరారు.

మండ్య నుంచి కుమార పోటీ చేయాలి

బెంగళూరు, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి.కుమారస్వామి మండ్య నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని జిల్లా జేడీఎస్ విభాగం డిమాండ్ చేసింది. జేడీఎస్ జిల్లా అధ్యక్షుడు డి.రమేష్ ఈ మేరకు ప్రకటన విడుదల చేశారు. ఈ నియోజకవర్గం నుంచి మాజీ ప్రధాని హెచ్‌డి.దేవెగౌడ గానీ మాజీ సీఎం హెచ్‌డి.కుమారస్వామి గానీ ఆయన కుమారుడు నటుడు నిఖిల్ కుమారస్వామి గానీ పోటీ చేయాలంటూ విజ్ఞప్తిచేశారు. ఈ ప్రకటనపై ఎమ్మెల్యే హెచ్‌టి.మంజు, పార్టీ సీనియర్ నేతలు డిసి. తమ్మణ్ణ, సిఎస్.పుట్టరాజు, సురేష్‌గౌడ, కె.అన్నదాని, రవీంద్ర శ్రీకంఠయ్య, కెటి.శ్రీకంఠెగౌడ, బిఆర్.రామచంద్రు సంతకాలు చేశారు. బీజేపీతో పొత్తు దరిమిలా ఈ నియోజకవర్గం తమకు దక్కుతుందని జేడీఎస్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి సినీనటి సుమలత ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొంది బీజేపీ అసోసియేటెడ్ సభ్యురాలిగా చేరిన సంగతి విదితమే.

సీసీబీ ఇన్‌స్పెక్టర్ అరెస్ట్

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బిట్‌కాయిన్ అవినీతి వ్యవహారంలో కంచె చేను మేసినట్లుగా మారింది. సెంట్రల్ క్రైం బ్రాంచి ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్‌బాబు, సైబర్ నిపుణుడు సంతోష్‌లను సిట్ అధికారులు బుధవారం రాత్రి అరెస్టు చేశారు. గురువారం మధ్యాహ్నం కోర్టు ముందు హాజరుపరచి కస్టడీకి తీసుకున్నారు. ఇద్దరినీ సిట్ అధికారులు బుధవారం విచారణ జరిపారు. ఇద్దరి ప్రమేయంపై పక్కా ఆధారాలు లభించిన మేరకు అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. బీజేపీ ప్రభుత్వ వ్యవధిలో జరిగిన బిట్ కాయిన్ వివాదానికి సంబంధించి సాక్ష్యాలను నాశనం చేశారనే ఆరోపణల మేరకు కాటన్‌పేట్ పోలీసుస్టేషన్‌లో సీసీబీ పోలీసులతో పాటు పలువురిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. అందుకు అనుగుణంగానే ఇద్దరిని అరెస్టు చేశారు.

బెల్‌నెస్‌తో మిలన్ ఒప్పందం



సంతాన సాఫల్యత పోస్టర్‌లు విడుదలచేస్తున్న వైద్యులు

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మిలన్ సంతానసాఫల్య కేంద్రంతో బెల్‌నెస్ ఛాంపియన్స్ కీలక ఒప్పందం చేసుకుంది. రెండు సంస్థలు కలిసి ప్రత్యేకంగా స్త్రీ, పురుషులకు చికిత్సలు అందించేలాంటి ఫర్టిలిటీ అండ్రాలజీ ఆసుపత్రిని ఆరంభించారు. గురువారం మిలన్ డైరెక్టర్, హెచ్‌సీజీ ఎండీ అంజలీఅజయ్‌కుమార్ లాంఛనంగా ఆరంభించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ కేన్సర్ ప్రివెన్షన్ వ్యవస్థాపకులు డాక్టర్ నందా రజనీష్, మాజీ కార్పొరేటర్ పుష్పా మంజునాథ్‌లతో పాటు బెల్‌నెస్ ఛాంపియన్స్ ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ కిశోర్ తదితరులు పాల్గొన్నారు. అంజలి అజయ్‌కుమార్ మాట్లాడుతూ సంతాన సమస్యలతో బాధపడేవారి కోసం ప్రత్యేక సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే బెల్‌నెస్ ఛాంపియన్స్‌తో ఒప్పందం చేసుకున్నామన్నారు. నందారజనీష్ మాట్లాడుతూ సమాజం ఎదుర్కొంటున్న ఓ కీలక సమస్యకు ఫర్టిలిటీ అండ్రాలజీ ఆసుపత్రి ఉపశమనం కలిగించనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆసుపత్రి సేవలను విస్తరింపచేసుకోవాలనే లక్ష్యంతోనే ఒప్పందం చేసుకున్నట్లు బెల్‌నెస్ ఆసుపత్రి ఫౌండర్ డాక్టర్ మంజునాథ్ అభిప్రాయపడ్డారు.

గాంధీ వర్ధంతి నాడు మానవహారం

● కాంగ్రెస్ నాయకుడు ఉగ్రప్ప

బొమ్మనహళ్ళి, జనవరి 25: దేశంలో సౌహార్దతకు భంగం కలిగేలాంటి చర్యలను ఖండిస్తూ గాంధీవర్ధంతిన హోసూరు రోడ్‌లో మానవహారం ఏర్పాటు చేస్తున్నట్లు కాంగ్రెస్ నేత ఉగ్రప్ప ప్రకటించారు. గురువారం హెచ్ఎస్ఆర్ లేఅవుట్‌లో సౌహార్ద కర్ణాటక వేదిక ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్దాల కాలంగా సహృదయతకు పేరొందినదన్నారు. కనకదాస పరంపర, వచనాల చైతన్యం, సూఫీ పోరాటాల వంటి ద్వారా సౌహార్ధతకు ప్రాధాన్యత ఇచ్చాయన్నారు. ఆదికవి పంప నుంచి విశ్వమానవ సందేశం ఇచ్చిన కువెంపు దాకా మనుష్యులంతా సమానంగా ఉండాలని సూచించిన వారే అన్నారు. కానీ ప్రస్తుతం సమాజంలో విడగొట్టే విధానం పెరుగుతోందని విచారం వ్యక్తం చేశారు. సమసమానత్వం ఆకాంక్షించిన మహాత్మా గాంధీ వర్ధంతిన మానవహారం చేపట్ట దలచామన్నారు. సీపీఎం నాయకుడు డాక్టర్ కె ప్రకాష్, వేదిక సంచాలనకులు అనిల్‌రెడ్డి, స్థానికులు బీఎస్‌రెడ్డి, కాంగ్రెస్ అధ్యక్షులు వాసుదేవరెడ్డి సహా పలువురు పాల్గొన్నారు.



మానవహారం పోస్టర్‌లు విడుదల చేస్తున్న ఉగ్రప్ప తదితరులు

బాలికపై లైంగిక దాడి కేసులో 20 ఏళ్ళ జైలుశిక్ష

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బాలికపై లైంగిక దాడికి పాల్పడిన కేసులో శివమొగ్గ జిల్లా సెషన్స్ కోర్టు నిందితుడికి 20 ఏళ్ళ కఠిన కారాగార శిక్ష విధిస్తూ గురువారం తీర్పు ప్రకటించింది. నిందితుడికి శిక్షతో పాటు రూ.2.20లక్షల జరిమాన విధించారు. 2021వ ఏడాది దావణగెరెకు చెందిన 27 ఏళ్ళ వ్యక్తి 16 ఏళ్ళ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డారు. బాలిక భద్రావతి గ్రామీణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఛార్జ్‌షీట్‌కు అనుబంధంగా శివమొగ్గ కోర్టులో సుదీర్ఘ విచారణలు జరిగాయి. ఈమేరకు న్యాయమూర్తి జేఎస్ మోహన్ తీర్పును ప్రకటించారు. నిందితుడికి 20 ఏళ్ళ జైలుశిక్షతో పాటు 2.20లక్షల జరిమాన విధించారు. రెండులక్షల నగదును బాధిత యువతికు చెల్లించాలని తీర్పులో ప్రకటించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరునెలల జైలుశిక్షను కొనసాగించేలా తీర్పు ప్రకటించారు.

పీఈఎస్‌లో బజాజ్ ఆటో లిమిటెడ్ నైపుణ్య కేంద్రం

బెంగళూరు, జనవరి 25(ఆంధ్రజ్యోతి): బజాజ్ ఆటో లిమిటెడ్ సామాజిక సేవా కార్యక్రమాలలో భాగంగా పీఈఎస్ యూనివర్శిటీలో ప్రత్యేక నైపుణ్య కేంద్రం ఏర్పాటుకు అంగీకారం లభించింది. గురువారం మైసూరులో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా పరిధిలోని వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్ళు భాగస్వామ్యులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాలకు చెందిన కళాశాలల విద్యార్థులకు శిక్షణలు ఇవ్వదలచినట్లు బజాజ్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఇదే సందర్భంగా పీఈఎస్ యూనివర్శిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కెఎస్ శ్రీధర్ మాట్లాడుతూ బజాజ్ ఇంజనీరింగ్ స్కిల్ ట్రైనింగ్(బెస్ట్) పేరుతో విద్యార్థులకు ఉపయోగపడే శిక్షణలు ఇచ్చే సౌలభ్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.



పీఈఎస్‌తో ఒప్పందం చేసుకుంటున్న బజాజ్‌ఆటో లిమిటెడ్ ప్రతినిధులు

సొగసు చూడ తరమా..!



దక్షిణాది రాష్ట్రాల్లో కెల్లా కర్ణాటక సచివాలయం ముగ్ధ మనోహరంగా ఉంటుంది. బెంగళూరు కబ్బన్ పార్కులో నిర్మించిన విధానసౌధ చుట్టూ రంగురంగుల పూల చెట్లు ఉన్నాయి. శీతాకాలంలో ఈ పూలచెట్ల మధ్య సచివాలయం ఎంతో అందంగా అలరారుతుంటుంది.. ఈ అపురూప దృశ్యాన్ని కనులారా తిలకించేందుకు సెల్ఫీలు తీసుకునేందుకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు పెద్ద సంఖ్యలో విచ్చేస్తుంటారు.

(ఆంధ్రజ్యోతి- బెంగళూరు)

పచ్చదనంతో ఆకట్టుకుంటున్న విధానసౌధ